కథానిక

# కోరుకున్న అర్ధాంగి

దండమూడి బాలగంగాధరరావు

జగన్మోహన్‌రావు అప్పుడే బజారునుంచి రక్షాదిగి యింట్లోకి వచ్చాడు. ఇల్లంతా నిశబ్దంగా వుంది. వరండాలోనే ఒంటరిగా కూర్చున్నాడు.

ఆకాశంలో మెఱపులు—ఉఱుములు, అంతా భయంకరంగా వుంది. ఆ విద్యుత్ కాంతులకు తట్టుకోలేక పోతున్నాడు. మబ్బు దట్టంగాపట్టింది. వర్షంవస్తుందేమో అనుకుంటూ వుండగానే వర్షం రానేవచ్చింది.

సాయంకాలం అయిదుగంటలవుతుందేమో. ప్రకృతి విచిత్రమైంది! గంటక్రితం ఎండ; యిప్పుడేమో కారుమబ్బు. క్షణం క్రితం ఆకాశంలో నిర్మలత్వం—ప్రస్తుతం భీకర స్వరూపం. ప్రకృతి అంతా మానవుని ఛాయా రూపమేమో! లేకపోతే, తనకూ దానికీ అంతదగ్గర సంబంధంలా ఎలా అనిపిస్తుంది!

జగన్మోహన్‌రావు నిట్టూర్చాడు. బుర్ర బలహీనంగా పనిచేయడంవల్ల వేడెక్కిపోతోంది. తనకిక కాంతిలేదని ధృడపర్చుకున్నాడు. అప్రయత్నంగా కళ్ళనిండా నీళ్ళు నిల్చాయ్. వాటంతటవి జారి యిగిరిపోయాయ్. బ్రతుకు భారంగా ఉంది. చచ్చి బ్రతుకుతున్నాడు.

"నే నెవరిని?" అనే ప్రశ్న ఆ ఏకాంతంలో తోసుకొచ్చింది మెదడులోకి. వెధవ ప్రశ్న అనుకున్నాడు...కాదు...ఏదో అర్థం కాకుండా ఆశ్చర్యపరుస్తోంది. జవాబుకోసం తన్నుకున్నాడు. "ఏమిటీ?...ఎవరివా? ... ఏమో?" సమాధానం ఎదుర్కొంది. అంతా పిచ్చిగా వుంది. తను పిచ్చివాడి ననుకున్నాడు. ముప్పైఏళ్ళ పైబడ్డ తనకు చివరికి అసలు తనెవరో తనకు తెలియటంలేదు. "అసలు నే నెవరిని?" ఆశ్చర్యం. "—" అంతా శూన్యం. మైకంగా వుంది. ఎర్రని కాంతుల్లోనుంచి మసక చీకటి మీదికొచ్చి నల్లబర్చింది. అంతా మాయ! ఫలానా సుందరరామయ్యగారబ్బాయ్—జగన్మోహన్‌రావు అనుకోటమే తప్ప—నిజానికి తనెవరో—ఎందుకు పుట్టాడో, ఏమిటో అర్థంకాకపోగా ఆశ్చర్యం వేసింది.

వర్షం మరీ ఎక్కువై—వరండాలోకి జల్లు పడేప్పటికి తల్లివచ్చి "లోపలికి రారాదూ" అంది. ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

* * *

జగన్మోహన్‌రావుది వొట్టి పల్లెటూరు. ఆ వూళ్ళో మొదటిసారి స్కూల్ ఫైనల్ పరీక్షయింది జగన్మోహన్‌రావే. అప్పటికి పదహారు సంవత్సరాలుంటాయేమో. అంత తక్కువ వయస్సులో పరీక్షయింది కూడా తనే—యీనాటికీ.

ఒక్కడే కొడుకు కావటం కారణంగా తల్లి పై చదువులకు అంగీకరించలేదు. లాగు పైకి లాక్కుంటూ "నే చదువుతానే" అన్నాడు మారాముగా కొడుకు. ఊళ్ళో వాళ్ళంతా చదివించమన్నారు. తండ్రికి కూడా చదివించాలని వుంది. ఐతే సుందరరామయ్యగారిది బొడ్లో కాణీ తీసే వ్యవహారం కాదుమరి. వాళ్ళ మేనమామగారింటికి పథిపితే బాగుండు ననుకున్నాడు.

మేనల్లుడు పరీక్షయ్యాడని కాకినాడనుంచి మేనమామ దామోదరయ్యగారు వచ్చారు. కాకినాడ కాలేజీలో చదవొచ్చు రమ్మన్నాడు. తమ్ముడుమాట కాదనలేకపోయింది తల్లి.

జగన్మోహన్‌రావు కాకినాడ కాలేజీలో చేరాడు. దామోదరయ్యగారు మేడమీద గది యిచ్చారు, మేనల్లుడు చదువుకని.

మేనమామ పెద్ద వ్యాపారస్థుడు. పాతికేళ్ళ క్రితమే గుడివాడసీమనుంచి వ్యాపార నిమిత్తం కాకినాడ వచ్చేశారు. దామోదరయ్యగారికి పదమూడేళ్ళ కూతురు పద్మ. మిగిలిన ముగ్గురూ కొడుకులు వున్నారు, మేనల్లుడు వచ్చేటప్పటికి.

క్రొత్తలో కూడా పద్మ బావయ్యను త్రోసుకు తిరిగేది. సిగ్గుపడేది కాదు. బావయ్య అంటేఎంతో యిష్టం. ఎందుకో తెలిసేది కాదు. మొదట్లో

కొంచెం సిగ్గేసినా, తనూ మరదలు చనువును స్వీకరించేవాడు. తండ్రికి పద్మంటేనే మక్కువ జాస్తి, కొడుకులమీదకన్నా. ఎన్నో కొత్తవస్తువులు తెస్తూవుండేవారు. వాటిల్లో బావకు ఎక్కువ పంచుతూవుండేది.

మేనల్లుడంటే దామోదరయ్యగారికి యిష్టమే కాని,. ఒకందుకు మండుకొచ్చేది కాలేజీనుంచి యింటికి రాగానే ఎప్పుడూ ఆ గదిలోపడి నిద్రపోయేవాడు. కాలేజీ విద్యార్థిని ఏమంటాడు? సహజంగా దామోదరయ్యగారు ఎంతో చురుకైన మనిషి. ఆ మెలకువతోనే చాల సంపాదన, పేరు గడించారు-మేనల్లుణ్ణి ఏమీ అనలేకభార్యవద్దగొణుగుతూవుండేవాడు. ఆమెకూడా తేలిగ్గామాటాడితే పద్మ మనస్సు నొచ్చుకునేది. పద్మకూడా చురుకైనదే. అక్కడికీ బావను చాటుగా ఎత్తిపొడుస్తూనే వుండేది, "నిద్రపెద్దమ్మగారు" అని. నవ్వుకునేవాడు.

రెండో సంవత్సరం వచ్చింది. దసరా పండుగకూడా వెళ్ళింది, "పరీక్షలు దగ్గర పడ్తున్నయ్. తప్పితే మీనాన్న నన్నంటాడు; జాగ్రత్తగా చదువుకో" అని మందలింపుగా కాకుండా సౌమ్యంగా చెప్పారు ఒకరోజున మేనమామ.

మార్పు మాత్రం శూన్యం. ఎప్పుడో కాస్సేపు చదివేవాడు. అప్పుడు మాత్రం యిల్లు తగలడ్తున్నా తెలియనట్లు వుండేవాడు. మిగతా అప్పుడు ఎప్పుడూ నిద్రే!

`ఒకరోజు అమ్మ పక్కింటికెళ్ళితే—నాన్న లేని సమయంలో—అంతా కలిపి ఏడుగంటలవుతుందేమో రాత్రి, బావగదిలోకి వెళ్ళింది పద్మ. ఎప్పుడన్నా చాటుగా కానీ, పదిమందిలో కాని అతనితో మాట్లాడితే-పద్మే. బావమరదులు అసలు దగ్గరకొచ్చేవారు కాదు. చిన్న పిల్లలు. అతను మాట్లాడిస్తేగా వాళ్ళు వచ్చేది? చప్పుడు కాకుండా గదిలోకి వెళ్ళేప్పటికి గురకలు పెట్టి నిద్రపోతున్నాడు. ఒళ్లు మండుకొచ్చింది. అందుకుకాదూ నాన్న అమ్మవద్ద గొడవచేసేదీ? లేపింది; చెప్పింది చదువుకోమని. కొంచెం భయపడి చదువు మొదలెట్టాడు. మేడమెట్లు దిగుతూ పద్మ తనను తానే తిట్టుకుంది, అనవసరంగా లేపి కేకవేసినందుకు. అతని నిద్రముఖం గుర్తుకొచ్చి నవ్వుకుంది.

నిద్ర నాపుకోవటమే కష్టంగావుంటే—మంచినీళ్ళకు క్రిందకేమి వస్తాడులే అనుకొని మరచెంబుతో నీళ్ళు, గ్లాసు పైకి పట్టుకెళ్ళింది. మళ్ళీ సుషుప్తావస్థలో వున్నాడు. ఎక్కడి పుస్తకాలక్కడే వున్నాయ్; బట్టలు మార్చుకోలేదు. పాదాలు దుమ్ముకొట్టుకుని వున్నాయ్. గదంతా శుభ్రంగా సద్ది-లేపలేక క్రిందికి వస్తూ 'అన్నం తినేప్పుడు కాళ్ళు కూడా కడగలేదనుకుంటా' అని విసుక్కుంది.

పరీక్ష లొచ్చాయ్. అప్పుడు కూడా రాత్రి తొమ్మిది దాటనిచ్చేవాడు కాదు. పరీక్షల్లో దామోదరయ్యగారు ప్రతిరోజూ 'ఎలా వ్రాశా' వని అడిగేవారు. ఏదో వ్రాశానంటూ వెళ్ళిపోయేవాడు మేడమీదికి. సమాధానంకోసం చెవులు నిక్కబొడుచుకు వినే పద్మ నిరుత్సాహపడేది.

శలవు లిచ్చారు. జగన్మోహన్‌రావు పెట్టె సర్దుకుంటుంటే పద్మ మేడపైకి వెళ్ళింది, పెట్టె తీసుకుంటూ పద్మను జూసి నవ్వాడు. పద్మ నవ్వలేదు. నవ్వదు కూడా. కావలిస్తే ఏడుస్తుంది. ఆ ముఖం అలా వుంది. అందుకు నవ్వాడు. పద్మ ఆపుకోలేకపోయింది. 'ఎందు కేడుస్తావ్' ఏమి అనాలో తెలియక దగ్గరగా వెళ్ళి అన్నాడు. దానితో మరీ ఏడ్చింది. దగ్గరకుతీసుకుని ఓదారుదామనుకున్నాడు. తాను క్రొత్తలో వచ్చినప్పటి పద్మకాదు. పెద్దమనిషై పెళ్ళీడుకొచ్చి నమ్మాయ్. అందువల్ల ధైర్యం చాలలేదు. పద్మకూ అలాగే వుంది. లేకపోతే బావచేతుల్లో మనసారా ఏడ్చేదే! వయస్సుల పరిణామంగా యీ ఎడబంధం ఏర్పడింది.

రైలువేళ మించిపోతోంది. క్రింద అత్తయ్యావాళ్ళూ ఏమనుకుంటారో అనే భయం వుంది. వెళ్ళొస్తానంటూ "వుత్తరాలు వ్రాస్తాగా" అన్నాడు.

"నీకు నిద్రకే టైం చాలదు; ఇంకేం రాస్తావు" అంది పద్మ. వెనక్కు తిరిగి నవ్వాడు, 'వ్రాస్తాగా' అని.

"నాకు రాయాలి మరి" గారాబంగా అంది రెప్పల్ని మూస్తూ, తీస్తూ. ఆ ఒత్తిడికి రెప్పలమీది నిల్చిన కన్నీరు కాస్తా చెంపలమీదుగా రాలిపోయినయ్. లేత దానిమ్మగింజల్లా వున్నాయ్-ముచ్చ

టగా చూస్తూ "నీకే వ్రాస్తాగా; నీవు కూడా వ్రాయాలి!" అన్నాడు. "అలాగే" అంటూ వయ్యారంగా జడ ముందులాక్కుంది, దుఃఖాన్ని మింగేసినట్లు ఓ నిట్టూర్పు విడుస్తూ.

జగన్మోహన్‌రావు యింటికి వెళ్ళాడు. వారానికో వుత్తరం వ్రాసేవాడు. క్రమం తప్పకుండా జవాబులు వచ్చేవి. నెల రోజులు పోయాక ఓసారి వుత్తరానికి జవాబు రాలేదు. కోపంకొద్దీ నాలుగు పేజీలు వ్రాశాడు, మనస్సు బాగుండ లేదంటూ వుత్తరం వచ్చింది.

సుందరరామయ్యగారు కొడుక్కి సంబంధాలు చూసేవాడు. కాకినాడలోనేమో దామోదరయ్య గారు పద్మకు వరుణ్ణి వెతికేవాడు. మధ్య జగన్ మోహన్‌రావు, పద్మా, కుడితిలో పడ్డ ఎలుకలు సామెతలా తన్నుకునేవారు. ఉత్తరాల్లో విలపించేవారు. అంతకన్నా ఏమీ చెయ్యలేరు.

పద్మ వుండగా నాన్న ఇంకో సంబంధం వెతకటం ఎందుకో అర్థంకాదు. అడగనూ లేదు; బావయ్యను తీసుకొచ్చి చదివించిన నాన్న తన కోసం యితర్లను దేవిరిస్తా డెందుకో, తోచేది కాదు పద్మకు.

వివిధ మనస్తత్వాలగల వ్యక్తులతో ఇదేగొడవ. సుందరరామయ్యగారికేమో, దామోదరం ఎంతటి వ్యాపారస్తుడైనా, అంతా బస్తీ బడాయి. "వ్యాపారం మొదలెట్టాక ఎకరం పొలం కొనాలి; వాడు మొనగాడు "అటువంటప్పుడు ఏం యివ్వగలడు?" అనుకునేవారు. దామోదరయ్యగారేమో బావ పీనాసి వ్యవహారమాయె; భూమివుందనుకో. ఎందుకూ తగలెయ్యను? కూతురు సుఖపడొద్దా, వయస్సులో? తను యిచ్చే ఐదువేలూ బూడిదలో పోసినట్లవుతుంది అని ఆయన వేరే ప్రయత్నానికి కారణం.

పద్మకొక ఆలోచన తట్టింది. చిన్ననాటకం ఆడాలనుకుంది. జ్వరంవచ్చినట్లు నటించింది. ఉపవాసం. మందు త్రాగదు. అసలే మనోవ్యాధితో వుండేమో—రెండు రోజుల్లో (గాళుపులుకూడా) బుర్రవేడెక్కి నిజంగా జ్వరం వచ్చింది. అందుకు మరింత సంతోషించింది పద్మ. ఇంకా జ్వరంవచ్చినట్లు నటించింది. తెలిసే పిచ్చిమాటలు మాట్లాడేది 'బావ' అనేది. 'బావయ్యా' అనబోయి ఏడ్చేది. అంతా అతన్ని గూర్చే కలవరింతలు. పలవరింతలు.

వారం రోజులు గడచినయ్. తల్లిదండ్రులు హడలిపోయారు. దామోదరయ్యగారు వెంటనే మేనల్లుడికి టెలిగ్రాం యిచ్చారు. తక్షణమే వూడిపడ్డాడతడు. "బావయ్యా!" అంటూ చేతులు పట్టుకు ఏడ్చేసింది. సముదాయించాడు జగన్మోహన్‌రావు. రెండు రోజుల్లో కోలుకుంది.

దామోదరయ్యగారు నొచ్చుకున్నారు. ఈ మాత్రం తెల్సుకోలేక పోయినందుకు ఇక గత్యంతరంలేదు అనుకున్నారు. వెంటనే అక్కగారి ఊరు వెళ్ళారు. బావతో యింకోవెయ్యి ఎక్కువిస్తానన్నాడు. డబ్బు పెళ్ళినాడు యియ్యాలన్నట్లు లౌక్యంగా తేల్చాడు బావ. ఆడపిల్ల తండ్రి అందులో అతణ్ణితప్ప యింకొకర్ని చేసుకోనంటోంది. అందువల్ల బావ కోర్కెలన్నీ తీర్చడానికి సిద్ధమయ్యారు దామోదరయ్యగారు.

పెళ్ళి వైభవంగా కాకినాడలోనే జరిగింది. ఆరోజే 'యూనివర్సిటీ రిసల్ట్సు' పడ్డాయి పేపర్లో. జగన్మోహన్‌రావు నెంబరుంది అందులో. దామోదరయ్యగారింట్లో అంతా ఆశ్చర్యపోయారు. అతను పరీక్షవుతాడని పద్మకూడా అనుకోలేదు. పద్మ నిజంగా తెల్లపోంది—కాదు నమ్మలేకపోయింది. అందరికీ అతడిమీద గొప్పఅభిప్రాయం ఏర్పడింది. ఎప్పుడూ నిద్రబద్ధకం మనిషి జయం పొందాడంటే ఎంత తెలివి వుండాలి! అనుకున్నారు మామగారు.

అప్పట్లో కోయంబత్తూరు వెళ్ళవలసొచ్చేది, ఎగ్రికల్చరల్ బి.యస్.సి.కి. వెంటనే వెళ్ళిపోయాడు. విజయంతో తిరిగివచ్చాడు.

వెంటనే వుద్యోగం దొరికింది, బందరులో కాపురం పెట్టాడు.

పద్మ జీవితంలో నూతనాధ్యాయం ప్రారంభమైంది. బావయ్యతో హాయిగా—ఒక ఉద్యోగి భార్యగా జీవిస్తోంది. అంతకన్నా ఆడపిల్ల కోరేదేమిటి?

సహజంగా పద్మ తెలివైనపిల్ల. మూడోఫారం వరకూ చదివింది. మంచి మర్యాదకల అమ్మాయి. అసలే అందమైన జామ పండువంటిపిల్ల; వీటన్నిటితో మరి ప్రకాశిస్తోంది.

పెళ్ళికాకముందు, కాపురం పెట్టకముందు ఓ రకం అందంవుండేది పద్మలో. మరి యీ జంట

జీవితంలో యింకో అందంవచ్చింది. హంసలను చూడకపోయినా యథార్థంగా, కళా మూర్తుల చిత్రాలలో, శిల్పాలలో చూసేవుంటాము. పద్మను చూడగానే వాటిని చూసినట్లు ఆ నడకలో నిండు గమనం వున్నట్లు తన్మయుండయ్యేవాడు జగన్మోహన్‌రావు. ఓ దేవతాలా కొల్చేవాడు.

పద్మ పనిచెయ్యటం బాధగానే వుండేది, అతగాడికి అందువల్ల వంటమనిషినీ, పనిమనిషినీ కూడా పెట్టాడు. జవాను ఎలాగూ వున్నాడు. ఇంట్లో అంతా పద్మ క్రిందికిదిగకుండానే జరిగి పొయ్యేది.

ఇంటివద్ద ఐదుగంటలకు నిద్రలేచే పద్మఇక్కడ ఏడుగంటలన్నా అవందే లేవదు. భర్తను మించి పోయింది బద్ధకంలో. జగన్మోహన్‌రావే మెరుగు. ఆఫీసు పనులవీ చూసుకోవాలని ఆరుగంటలకే మేల్కొనేవాడు. లేస్తూ ఆ ఉషఃకాంతుల్లో పద్మను జూచి జగదేక సుందరి అనుకుని మురిసి పోయేవాడు. ఆ మత్తు సౌందర్యంలో జాగ్రత్తగా మంచందిగి చప్పుడు కాకుండా పద్మకు దుప్పటి కప్పి, తలుపులు దగ్గరగా లాగి మరీ వెళ్ళేవాడు కాలకృత్యాలు తీర్చుకోడానికి.

తన పని అయ్యాక టూత్ పేష్టు, బ్రష్ పద్మ కోసం తెచ్చి వరండాలో స్టూల్ మీద పెట్టే వాడు. పనిమనిషి బకెట్టుతో నీళ్ళు పెట్టేది. నెమ్మదిగా తను వెళ్ళి లేపేవాడు. గారాబంపోయేది. అనునయంగా పిల్చేవాడు. ప్రొద్దుపొడిచిందని బ్రతిమిలాడేవాడు. టిఫెన్ తిందువుగాని రమ్మనే వాడు. దాంతో మరీ పసిపాపలా పగలు పోవటం నేర్చుకునేది.

మంచం నుంచి దిగేప్పటికి మొత్తంమీద ఎనిమి దయ్యేది. ముఖం కడుక్కోటం అరగంటపైగా పట్టేది. ఒకటే తోముడు తోమేది. "రాణీగారికి ఎంత శుభ్రం!" అంటూండేవాడు. పని మనుషులు కూడా "మా అమ్మగారు అందరిలాంటి వారు కారు; అంతా శుభ్రం" అంటూ వుండేవారు. దాంతో మరీ అలవాటు చేసుకుంది. అతనికి అలా వుంటంచూసి గర్వం. "అమ్మగారికి టిఫెన్ తీసుకురా, ముత్యాలూ" అనేవాడు వంటయింట్లోకివెళ్ళి వంట మనిషితో, దారిలో దాని చేతులోది అందు కుని గదిలోకి వెళ్ళేప్పటికి మళ్ళీ పడుకుని వుండేది. స్టూల్‌ని మంచం దగ్గరకులాగి—దాని మీద టిఫెన్ పెట్టి లేపేవాడు. 'అబ్బ! ఆకలిలేదు' అనేది. 'ఫర్వాలేదంటూ' లేపి "కొంచెం" "కొంచెం" అని తనే స్పూన్‌తో తినిపించేవాడు.

ఆఫీసుకి వెళ్ళివచ్చేప్పటికి పన్నెండు గంట లయ్యేది. అప్పటి వరకూ పద్మ స్నానం చేయడం బట్టలు మార్చుకోటంతో గడిపేది...ఎన్ని నీళ్ళు పోసుకునేదో అంతుండేదికాదు. కళాయి, తొట్టి, మూడు గుండిగలు నీళ్ళు అయ్యిపోయేవి. పనిమను షులకు లోపల కష్టంగానే వుండేది. 'ఎన్ని నీళ్ళని పోస్తాం' అని.

సుందరామయ్యగారు అప్పుడప్పుడూ వస్తూ వుండేవారు. ఆయన పెద్దగా యిల్లుకదలడు. ఎప్పు డన్నా కదిల్తే కొడుగ్గారింటికే. ఇంటికి రాగానే పని మనుషులతో, సకల గౌరవాలు జరిగిపోయేవి. పద్మ అంతగా కనుపించదు. ఆయన వెళ్ళేప్పుడు చెప్పిపోదామంటే ఆ సమయంలో నిద్రపోతూనో లేక పెరటిలో ఏవో పనులు పురమాయిస్తూనో ఉండేది. దీనికింత శుభ్రం ఏమిటా అనుకునేవారు. తనను దమ్మిడీ అడగటంలేదు. వాళ్ళిద్దరూ సుఖంగా వుంటారు: అదే చాలనుకుని వెళ్ళేవారు.

జగన్మోహన్‌రావు తల్లి ఎప్పుడూ వచ్చేది కాదు. రావాలంటే యిల్లుతాళం పెట్టాలి. పాడి గేదేమౌతుంది? పాలేరో—ఇవీ సమస్యలు. ఎప్పు డన్నా వచ్చినా, పక్కింటివాళ్ళకు పాడి ఒప్పజెప్పి మరీ వచ్చేది. అత్తగారికి కొంచెం కష్టంగానే వుండేది. కోడలి ప్రవర్తన అంతా రాణీభోగం వెలగబోస్తోంది. వాడేమో దాని వెనకాలే తిరుగుతాడు—పురుషత్వం మరచి. కుక్క ఇంట్లోకి వస్తే యిల్లంతా కడగాలా? ఏమి అంటో ఏమిటో సంసారస్త్రీకి లక్షణం కాదుమరి అని స్వగతంగా నోరు నొక్కుకునేది. ఎదురుగా కోడల్ని అనలేదు.

కొడుకుతోనే ఒకసారి అంది, కోడలు స్నానాల గదిలోకివెళ్తే—"అలా నువ్వు లోకువవ్వబోకు - ఇద్దరూ పాడవుతారు. ఐనా, ఎవరిపని వాళ్ళు చేసుకుంటుంటే అది యింటికీ వంటికీ శ్రేయస్కరం" అని. మౌనంగా వూరుకున్నాడు. లోపలేమో, "తల్లి అనవసరంగా కల్పించుకుంటోంది—తనకెందుకు?" అనుకునేవాడు.

పద్మతల్లి వచ్చింది ఒకసారి. భర్త వ్యాపారం హడావిడీ—పుట్టే పిల్లలూ క్షణం తీరిక వుండేది కాదు ఆమెకు. అదే మొదటిసారి రావడం. కూతురు ఇల్లదీచూచి సంతోషించింది. హాయిగా గడచిపోయినయ్ వున్నన్ని రోజులు. అల్లుడంటే చెప్పరాని మమకారం వెల్లివిరిసింది. సకల సౌకర్యాలతో కూతురు అల్లుడు సుఖంగా వున్నందుకు గర్వపడేది. చివరికి వెళ్ళలేక వెళ్ళేది కాకినాడ.

హాయిగా గడచిపోయేది కాలం. జగన్మోహన్ రావుకి మంచిపేరు వచ్చింది పట్టణంలో. సక్రమంగా ఆఫీసుపనులు నిర్వహించడం—డబ్బుకు చేయి జాపకుండటమే కారణం. టవున్‌లో పెద్దపెద్ద వాళ్ళంతా స్నేహితులయ్యారు.

పద్మకు నెల తప్పినట్లు చెప్పింది భర్తతో ఒక రోజు. అతనికి సంతోషంతో కూడిన సంభ్రమం ఒళ్లంతా పులకసింపజేసింది. పద్మకు ఏం యిప్పించాలి? ఏమేమి తెచ్చిపెట్టాలి? అనే వుత్సాహం పొంగిపోయింది. ఆఫీసు విడిచి అదివరకు ఓగంట క్లబ్బుకెళ్ళేవాడు. ఇప్పుడు అదికూడా మానేసి నేరుగా యింటికే వచ్చేవాడు. వచ్చేప్పుడు దారిలో మార్కెట్టువద్ద ఆగి రకరకాల ఫలాలు రిక్షాలో పెట్టించుకొచ్చేవాడు.

"మీరు తేవాలా! జవాను తేడూ?" నవ్వుతూ అనేది పద్మ అవి అందుకుంటూ. ఎప్పుడూ మార్కెట్టునుంచి జవాను లేవడంఅలవాటు. "వెధవ, వాడికి మంచిపళ్ళు తీసుకురావడం చేతకాదు" అనేవాడు.

ఇద్దరు ముగ్గురు అనుభవంగల డాక్టర్సుకి చూపించాడు. పళ్ళరసం, వేళపట్టున ఆహారం యిప్పించమన్నారు. తనే స్వయంగా ఆ కార్యక్రమం తీసుకున్నాడు. ఉదయం తొమ్మిదింటికి బత్తాయిరసం, మధ్యాహ్నం ఆఫీసుకు వెళ్ళబోతూ రెండింటికి చెక్కరకేళీలు, ద్రాక్ష, రాత్రికి యాపిల్సు యిస్తూ వుండేవాడు.

చిక్కిపోయి కొత్తరక్తం వస్తోంది. అందమైన ఆడపడుచులు చిక్కిన కొద్దీ అందంసుమా! ఒక రోజు రాత్రి పద్మతో అతను ఆమాటే అన్నాడు. మందంగా నవ్వింది. వైలెట్‌రంగు మఖ్‌మల్ జాకెట్టులోంచి రెడ్‌లైట్ వెల్తుర్లో సిగ్గుదొంతరలు తొంగిచూశాయ్. తట్టుకోలేక అందులో ఆమెలో విలీనమైపోయాడు అతడు మరి!

కాకినాడనుంచి దామోదరయ్యగారు కూతుర్ని తీసుకువెళ్ళడానికివచ్చారు. ఎనలేని బాధ జగన్మోహన్‌రావుని ముంచేసింది. వెళ్ళేప్పుడు రోజుకోవుత్తరం వ్రాయమంటూ సాగనంపాడు.

పద్మలేని యిల్లు రవి అస్తమించినట్లుగా బాధపడ్డాడు. ఈ నాలుగు సంవత్సరాలనుంచీ జగన్మోహన్‌రావుకి మంచిపేరు వచ్చింది జిల్లాలో. ఆ వుద్యోగంలో లంచం పుచ్చుకోని మనిషి లేడు. ఆ పనంటే దూరంగా వుంటా డతడు. అందువల్లే యింత పేరు వచ్చింది.

రోజూ టపాకోసం ఎదురుచూసేవాడు. అన్నీ ఆఫీసు వుత్తరాలే. ఎప్పుడన్నా పద్మా వ్రాస్తే పదిసార్లకు తక్కువ చదివేవాడు కాదు...

ఓ రోజు పద్మ ప్రసవించినట్లు వుత్తరంవచ్చింది "ఆడపిల్ల-తల్లి కులాసా" అని వుంది అందులో. ఆడపిల్ల! అతని ఆనందానికి హద్దులు దాటినయ్. ఆనందమయజీవితంతో తమ ప్రేమలకు పూచిన పుష్పమిది. తమ రక్తంలోంచి ఓ గులాబీ!

వెంటనే శలవుపెట్టి వెళ్ళాడు. ఉన్న ఆ రెండు రోజులూ పిల్లని చూస్తూ పద్మను చూస్తూ గది చుట్టూ తిరుగుతూనే వుండేవాడు.

ఆరోనెల వచ్చాక తీసుకొచ్చాడు. పిల్ల పేరు "ఉష" అని నామకరణం చేశారు. ఇంటికొచ్చినప్పటినుంచీ పిల్లను క్రిందికి దింపేవాడు కాదు. ఆఫీసు పనులు కూడా అంతగా పట్టించుకోవడం మానేశాడు. పద్మ ఎప్పుడూ తన సుఖమేమో తను చూసుకునేది. పిల్లగొడవ అంతగా పట్టించుకునేది కాదు. రోజురోజుకూ చాదస్తం ఎక్కువౌతోంది. ఎప్పుడూ అతిశుభ్రం స్నానం ఇదే ఆమె జీవితపు నిత్యకృత్యమౌతోంది. జగన్మోహన్ రావుకి అర్థమైయ్యేదికాదు. అక్కడికీఎప్పుడన్నావ్ అంటూనే వుండే వాడు "పిల్లనలా ఏడిపిస్తావ్ దేనికీ? ఎంతసేపు స్నానం" అని ఐనా, వినేది కాదు.

మగవాడు అర్థాంగికి లొకువైతే ఆవిడ అతన్ని తన స్వార్థానికి ఎంతగానైనా వుపయోగించుకుంటుంది. అందుకు దార్కాణం పద్మే. నిజానికి జగన్మోహన్‌రావుకి పద్మంటే తగనిప్రేమ, ప్రాణం

ఐనా దానం చెయ్యగలడు. ఆ స్థితికి వచ్చాడు కూడా. పద్మకు భర్తంటే ఎంతో ప్రేమ ఒకప్పుడు. కాని అది గారాబంగా మారి మారాం అయ్యి కూర్చుంది. భర్త సుఖం కోసం ఏపనీ చెయ్యదు. చెయ్యాలని గుర్తించనూ లేకుండావుంది. పిల్ల శిక్షణ కూడా తన కర్తవ్యం కాదనుకుంది; జగన్మోహన్‌రావే ఉష పనులన్నీ చూసేవాడు. అది అతని బాధ్యతే ననుకుంది.

జగన్మోహన్‌రావుకి తీరికే తక్కువైంది. ఆఫీసు పనులన్నీ హెడ్ గుమాస్తామీద ఒదిలేసేవాడు. ఎప్పుడూ ఇంటిపట్టునే వుంటూ పిల్లకు పని మనుషులతో పోషణ చేయించుతూ వుండేవాడు. తను లేకపోతే పిల్లగొడవ పట్టించుకునేది కాదు. పిల్లేమో ఏడుస్తూ వుండేది. కోపంవచ్చి పద్మ చావబాదేసి. అందువల్ల అతడు ఇంటివద్దే ఎక్కువగా వుండేవాడు.

అవయవాలకు తగిన పరిశ్రమ లేందే అవి ఎందుకు చెడిపోవు? తిన్న తిండన్నా అరగాలా? పద్మకు ఏదో సుస్తీయీమధ్య. ఒకడాక్టరుకాదు- ఆ పట్టణంలో అంతా అయ్యారు. మొట్టమొదట నీరసంగా వచ్చింది వ్యాధి. తర్వాత కడుపులో నొప్పి ... విరేచనాలు. పదికి తక్కువవ్వవు రోజుకూ. మనస్సు స్థిమితంలేకపోవటం;ఒకటేమిటి? ఒకదానివెంట వొకటి! ఐనా తన పని తాను మానదు. వైద్యులసలహా వినదు. ఉదయం ఎనిమిది గంటలకు లేస్తుంది. ముఖం తొమ్మిదింటివరకూ. స్నానం పన్నెండౌతుంది; తలంటౌతే ఒంటిగంట దాటాలి. ఎన్ని నీళ్లు, ఎన్ని నీళ్లు! వాటికి అంతుండదు.

ఉషకు ఏడేళ్ళు వచ్చాయ్. ఆ పిల్లనెప్పుడూ క్షణం కూర్చోనివ్వదు. అవీ-ఇవీ అందియ్యమని కొడ్తూ వుంటుంది. ఉషే తనజీవిత ఆశారేఖ అనుకుంటాడు జగన్మోహన్‌రావు. పిల్లను కొట్టొద్దనీ, ఎంతసేపూ పని తెమల్దేమనీ ఎప్పుడన్నా అతడు కోప్పడితే రెండు రోజులు మంచం దిగదు. కాళ్ళా వ్రేళ్ళాబడి బ్రతిమిలాడ్తాడు. అప్పటికిగాని శాంతించదు. అతడికి అదే ఆనందం. అంతగా దాసుడైపోయాడు.

మానవుడికి మంచిరోజులు కొన్నాళ్ళే. వాటిని సద్వినియోగం చేసుకోవటంలోనే అతని ప్రత్యేకత! అప్పుడే అతడు జీవితాంతం సుఖాలుపొందుతాడు.

జగన్మోహన్‌రావు ఇది గుర్తించలేదు. ఎంతసేపూ భార్యా,పిల్లే తన లోకం. హెడ్ గుమాస్తాయే ఆఫీసు పనులన్నీ చూసుకోవటం. అతడు మంచివాడు కావద్దూ? ఐనా, లక్ష్మి వస్తానంటే ఎవ్వడు తిరస్కరిస్తాడు! ఇంకో జిల్లావాడికి బండిపట్టాలు అమ్మాడు రహస్యంగా. తెలియక దాని నామోదించాడు, జగన్మోహన్‌రావు. తెల్సుకునే స్థితిలో కూడా లేడు పాపం. అక్కడే ఓ రైతు పట్టాలు కావాలని జగన్మోహన్‌రావుని అర్థించాడు. కోటా అయ్యిపోయింది. ఆమాటే చెప్పాడు అతను. దానితో ఆరైతుకు కోపంవచ్చి కేసుపెట్టాడు, ఇంకో జిల్లావాడికి అమ్మినట్లు సాక్ష్యం వుంది అతని దగ్గర. దాంతో జగన్మోహన్‌రావ్ వుద్యోగం 'సస్పెండు' చెయ్యబడ్డది. 'లంచగొండి' అని పెద్ద పుకారు బయల్దేరింది. మంచివాడికి ఒకమాట అని పదివేలు పోయినా ఒప్పుకుంటాడు, కాని అక్రమమైన పనులు చేసే స్వభావం కాదతడిది.

ఉద్యోగం వూడింది. పాడు పుకారు బజారులోకి వెళ్ళనివ్వటంలేదు. తల్లిదండ్రులకు కూడా దూరం అయ్యాడు. "భార్యకు దాసుడయ్యి, వంశప్రతిష్ఠ మంటగల్పాడు" అని వాళ్ళకు కోపం. కాణీ యియ్యనన్నాడు తండ్రి.

భార్యకేమో మందులు వాటిని కొదవలేదు; ఏనాడూ ఎవ్వర్నీ ఆశించనతను చేబదుళ్ళకై స్నేహితుల దగ్గరకు వెళ్ళేవాడు. ఆ డబ్బుతో భార్యకోర్కెలు తీర్చేవాడు.

కేసుకు వాయిదాలు జాస్తి. నెమ్మదిగా, జిల్లా కోర్టుదాటి, హైకోర్టుకు వెళ్ళింది వ్యవహారం, స్నేహితులవద్ద చేబదుళ్లు ఐదువేలు దాటినయ్. తను మద్రాసు వెళ్ళాలి కోర్టు వ్యవహారానికి.

ఆ సమయంలోనే పద్మ మందులకు విసిగి వరంగల్లులో యోగివున్నాడు; వెళ్తానంది. ఒద్దన్నాడు. ఆర్థిక పరిస్థితులు అటువంటివి. మూడు రోజులు గంగ మ్రింగకుండా పడివుంది. తన యింటికి వెళ్ళమన్నాడు. ససేమిరా, వెళ్ళనంది. కనీసం ఖర్చు ఐనాసరే, తనతో మద్రాసు రమ్మన్నాడు. ఒప్పుకోలేదు. ఇక గత్యంతరం లేకపోయింది. ఎక్కడో ఓ ఐదొందలు తీసుకుని వరంగల్లులో తన స్నేహితుడింట్లో తను వచ్చేవరకూ

వుండమన్నాడు. స్నేహితుడికి కూడా వుత్తరం వ్రాశాడు.

వెళ్ళేప్పుడు ఉష నాన్నను ఓ గడియారం తెచ్చిపెట్టమంది. వచ్చేదుఃఖాన్ని అపుకుంటూ "తప్పక తెస్తానుగా తల్లి!" అంటూ మనసారా ముద్దిడుకున్నాడు. ఉషను కొట్టొద్దని పద్మతో చేతులో చెయ్యివేసి వేడుకున్నాడు. రైలు కదుల్తోంటే పద్మవంకా, ఉషవంకా చూస్తూ వుండిపోయాడు. తన జీవితంలో ఎప్పుడూ అనుకోలేదు యిటువంటి పరిస్థితులు వస్తవని.

మద్రాస్ వెళ్ళిపోయాడు. ఆయనక్కడ; భార్యా, పిల్లా వరంగల్లులో. భర్త చెప్పినట్లు చెయ్యలేదు పద్మ; పూర్కే రెండురోజులు స్నేహితులింట్లోవుంది. తనకక్కడ బాగుండలేదు. స్వేచ్ఛ లేదు. వెంటనే యోగి ఆశ్రమంవద్ద ఓ పాక అద్దెకు తీసుకుంది. అక్కడైతేగాని తన శుభ్రానికి-స్నానానికి వీలుకాదు.

ఉదయం, సాయంకాలం స్వామివారి దర్శనానికి ఫలాలు, పుష్పాలు కానుకగా తీసుకెళ్ళేది. నూరుసార్లు ప్రదక్షిణాలు చేసివచ్చేది. ఉషను ఎప్పుడో ఒకసారిగాని వెంటబెట్టుకు వెళ్ళేదికాదు. చీటికి మాటికీ కొడుతూవుండేది.

మద్రాస్‌లోనేమో బికారిగా బీచివెంట తిరిగేవాడు జగన్మోహన్‌రావు. వరంగల్లులో వాళ్ళేం యిబ్బంది పడుతున్నారో తల్చుకుంటూ బాధ పడేవాడు.

చివరికి హైకోర్టు తీర్పు చెప్పింది. అదృష్టవశాత్తు తనే గెల్చాడు. తన ఖర్చులు, సంవత్సరం నుంచీ జీతంకూడా ఇచ్చేశారు. అదే ఉద్యోగంలో ఖాయంకూడా చేశారు. ఆనందం అతన్ని ముంచివైచింది. తనకూతురు కోర్కె గుర్తొచ్చింది మెదడులోకి. సంభ్రమంతో, లేచినుంచున్నాడు. బజారుకెళ్ళి లేడీస్‌వాచ్ అందమైనది చిన్న సైజులో కొన్నాడు. ఇంకెన్నో వింత వస్తువులు కొని వరంగల్లుకి ప్రయాణమయ్యాడు.

ఆ రోజు ఆశ్రమంలో పెద్ద సంతర్పణ. పద్మ కూడా కొంత ధనం యిచ్చి చేయించుతోంది. తల్లి వెళ్ళేప్పుడు ఉషకూడా వస్తానంది. రెండు బాదింది. వినలేదు- ఓపికకొద్దీ చావగొట్టింది. తను వచ్చేటప్పటికి ఇల్లదీ సర్దివుంచమంది. ప్రొద్దుపోతే, దీపం వెలిగించమంది. దెబ్బలకి హడలి అలాగే చేస్తానని దణ్ణం పెట్టింది కూతురు.

తల్లి చెప్పినట్లే చేసింది. చీకటి పడింది. భయం వేస్తూంది. దీపం వెలిగిద్దామని లోపలికి వెళ్ళింది. లైటు వెలిగించేటప్పుడు తన పరికిణీ అంటుకుంది. అదిమొదట్లో చూడలేదు. పెద్దమంటయ్యేటప్పటికి కళ్ళు జిగేలుమని మసకలు తేలాయి. ఎటూవెళ్ళలేక అక్కడే కూలబడింది స్పృహతప్పి.

తల్లి వచ్చేటప్పటికి ఒళ్లతోపాటు తాటాకుల పాకకూడా తగులడి నల్లబడ్డ జీవంపోయిన శరీరం మిగిలింది.జనం మంటల నార్పుతూ చుట్టూజేరారు.

కూతురుమీదపడి ఆ రాత్రంతా ఏడ్చింది. స్నేహితులు వాళ్ళువచ్చి వూరడించారు. వూరుకోలేదు—

ఉదయం భర్తవచ్చాడు. చూచి నిర్జీవుడైనాడు. విషయం అంతా విన్నాడు ప్రక్కవాళ్ళద్వారా. ఆ సమయంలో మానవుడులోని పశుత్వం పరవళ్ళు తొక్కింది. వికలాంగి ఐన కూతురు ముఖం చూడలేక— అంధకారాన్ని చూస్తూ పాదాలవద్ద కూర్చుండిపోయాడు. పద్మవచ్చి కౌగలించుకుంది. వెక్కి-వెక్కి ఏడ్చింది. చల్లబడిపోయాడు. ఆవేశం దానంతటదే మబ్బు తునకల్లా మాయమయ్యింది, భార్య స్పర్శవల్ల జవచచ్చిన మనిషిలా తలనొగ్గాడు. దహన సంస్కారంచేసి ఇంటికివచ్చారు దంపతులు.

* * *

వారం రోజులైయింది, ఆ విషాధ సంఘటన జరిగి. జగన్మోహన్‌రావు పూర్తిగా మారిపోయాడు. పిచ్చివాడై, ప్రపంచాన్నే మరచిపోయాడు. పద్మేమో ఏడ్చినంతసేపు ఏడుస్తుంది. తన మామూలుపనులకు ఆటంకం రానివ్వదు. పూర్వంలా స్నానం చీర కట్టకోటం మళ్ళీ మందులంటూంది- ఏదీ తప్పటంలేదు. అందుకు కాదనలేదు అతడు.

ఆ యింట్లో పూర్వపు ఔన్నత్యం పోయింది. బంధువులొస్తున్నారు, పోతున్నారు. అతనికేమీ తెలియటంలేదు. చీకటి కమ్ముకుపోతోంది. ఆఫీసు సంగతే మరచిపోతున్నాడు.

అంతా అంధాకారం మీదకొచ్చి నుంచున్నట్లుంది. అందులో పద్మ రాక్షసిలా ప్రత్యక్షమై మాయమై పోతోంది...

★